క్లుప్తంగా

అనుబంధ విభాగాల కమిటీలు నియామకం

సదుం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో మండల కమిటీలను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. శ్రీనివాసులు(బీసీ), నాగేశ్వరరావు (క్రిస్టియన్), లక్ష్మయ్య(కల్చరల్), నజీమున్నీసా (మహిళా విభాగం), ఖాజాపీర్(మైనారిటీ), సీతాపతి (ఎస్సీ), శ్రీనివాసులు(ఎస్టీ), వినోద్‌కుమార్ (యువజన), వెంకటరెడ్డి(రైతు) విభాగాలకు అధ్యక్షులుగా నియమించింది. మిగిలి కార్యవర్గ సభ్యులను ప్రకటించింది.

లైబ్రరీకి బీరువా, కుర్చీలు వితరణ


బీరువా, కుర్చీలను అందజేస్తున్న సాగర్‌రాజ్

కుప్పం రూరల్: గుడుపల్లెలోని గ్రంథాలయానికి రూ.30 వేల విలువ చేసేబీరువా, ప్లాస్టిక్ కుర్చీలను కుప్పం ఇంజినీరింగ్ కళాశాల సీఈఓ సాగర్‌రాజ్ గురువారం వితరణ చేశారు. అలాగే శెట్టిపల్లెలోని బధిరుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. తన జన్మదినం పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై విహారం


పుర వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీ శ్రీనివాసస్వామి ఆలయంలో గురువారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పద్మావతి శ్రీనివాసస్వామికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేద పండితులు స్వామివారిని సూర్యనారాయణుడు అలంకరణతో ముస్తాబు చేసి, మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ, పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కానిస్టేబుల్‌కు అవార్డు


అల్లావుద్దీన్

గంగవరం: గంగవరం పోలీస్ స్టేషన్‌లో బదిలీపై బైరెడ్డిపల్లెలో పనిచేస్తున్న కానిస్టేబుల్ అల్లావుద్దీన్‌ను డీజీపీ కమెన్‌డేషన్ డెస్క్ అవార్డు వరించింది. ఈయన 12 ఏళ్లు పలమనేరు సబ్‌డివిజన్ ఐడీ పార్టీలో పనిచేశారు. 2022లో ఇక్కడ కానిస్టేబుల్‌గా పనిచేసే సమయంలో హత్య, దొంగతనాలు, మద్యం అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో చూపిన ప్రతిభకుగాను తనకు ఈ అవార్డు లభించినట్టు అల్లావుద్దీన్ పేర్కొన్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్


జగన్నాధరావు

కుప్పం/కుప్పం రూరల్: పాలిసెట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కుప్పం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, చిత్తూరు జిల్లా పాలిసెట్ కన్వీనర్ డాక్టర్ జగన్నాధరావు తెలిపారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలిసెట్‌కు ఏప్రిల్ 5వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేయడంతో త్వరితగతిన ఉద్యోగాలు పొందడానికి ప్రభుత్వం 40 పరిశ్రమలతో కోర్సులను అనుసంధానం చేసినట్లు చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9989064100 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

సారా స్థావరాలపై దాడులు


ఊట ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

సదుం: సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ మారుతి గురువారం తెలిపారు. మండలంలోని చీకలచేను అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో గంజిగుంట వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన 2800 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్టు చెప్పారు. అలాగే 35 లీటర్ల సారా, సారా తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఓట్ల కోసం దగా చేస్తున్న చంద్రబాబు

- జగనన్న పాలనలోనే సంక్షేమం
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి దుర్గ


చీకటిపల్లెలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దుర్గ

గుడుపల్లె: చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తాడనేది వట్టి కలేనని, ఎమ్మెల్యేగా, సీఎంగా ఉన్నంత కాలం చేయని ఆయన కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన పాపానపోలేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ సతీమణి దుర్గ విమర్శించారు. అభివృద్ధి చేస్తామని ఇక ఇప్పుడు చెప్పడం ఓట్ల కోసం మరోసారి ప్రజలను దగా చేయడానికేనన్నది గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని చీకటిపల్లె, వెంకటాపురం గ్రామాలలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. నవరత్న పథకాలలో ఏయే వాటి కింద సంక్షేమ లబ్ధి పొందారో ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు ఇచ్చిన జగనన్న రుణం తీర్చుకునేందుకు ఎమ్మెల్యేగా భరత్‌ను, ఎంపీగా రెడ్డెప్పకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

కుప్పం: 2019 నుంచి ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలచి ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని మున్సిపాల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కోరారు. గురువారం మున్సిపాలిటీలోని 18,19 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజకీయాలు, పార్టీకలతీతంగా ప్రజలు ఐదేళ్లు లబ్ధి పొందిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ సొసైటీ చైర్మన్ అబ్బాస్, స్థానిక నాయకులు నాను తదితరులు పాల్గొన్నారు.

కెంచనబళ్లలో ఇంటింటా ప్రచారం

రామకుప్పం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు మండలంలోని కెంచనబళ్ల పంచాయతీలో జోరుగా ప్రచారం చేశారు.ఇంటింటా కరపత్ర ప్రచారం చేస్తూ ఓటర్లను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ భరత్ కుప్పం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించారని, సీఎం, మంత్రి రామచంద్రారెడ్డి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన్ను ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం,ఎంపీటీసీ సభ్యుడు చలపతి, మండల కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, నేతలు మంజునాథ్ రెడ్డి,రమణ పాల్గొన్నారు.


కుప్పం: ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్


రామకుప్పం: కెంచనబళ్లలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

హిందూ–ముస్లింల సఖ్యతతోనే రాష్ట్రాభివృద్ధి


ఇఫ్తార్ విందులో భరత్, పార్టీ నాయకులు

- ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

కుప్పం రూరల్: హిందూ–ముస్లిం, మైనారిటీల సఖ్యతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ పేర్కొన్నారు. గురువారం రాత్రి కుప్పం మండలం గోపినగర్ మసీదులో గురువారం రాత్రి ముస్లింలు ఇఫ్తార్ విందు ఇచ్చారు. వారి ఆత్మీయ ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందుకు భరత్ హాజరై మాట్లాడారు. హిందువులు, ముస్లింలు మత సామరస్యంతో కలసిమెలసి ఉన్నారు కాబట్టే అభివృద్ధి సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం అభ్యున్నతికి కూడా పలు పథకాలు అమలు చేశారని వాటి గురించి ఉదహరించారు. ఇది దృష్టిలో ఉంచుకుని ముస్లిం మైనారిటీలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మురుగేష్, బర్కతుల్లా, షౌకత్, మసీదు పెద్దలు ఇమామ్ సాహెబ్, ప్యారీజాన్, చాంద్‌బాషా, అక్తర్, తజు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు సహకరించండి


మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

- కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: పట్టణంలో శ్రీసుగుటూరు గంగమ్మ జాతరను పకడ్బందీ, ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. గురువారం మున్సిపాలిటీలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 2, 3వ తేదీలలో నిర్వహించనున్న జాతరకు సంబంధించి పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, మంచినీటితో పాటు చలువ పందిళ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్యం మెరుగు పరుస్తామన్నారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పలమనేరు డీఎస్పీ మగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేసేదిశగా మఫ్టీలో పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. ప్రజలు జాతరను జయప్రదం చేసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, మెడికలాఫీసర్ డాక్టర్ రంజిత, డీఈఈ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి


రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శ్రీనివాసులు

- కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు హెచ్చరిక

కుప్పం: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రాజకీయ పార్టీలు ప్రచారాలకు అనుమతి తప్పనిసరిగా పొందాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కుప్పం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇష్టానుసారంగా పార్టీ జెండాలు, బ్యానర్లు, తోరణాలు కట్టడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా మైక్ వాడటం, సభలు, సమావేశాల నిర్వహణకు, ఎన్నికల ప్రచారాలకు వినియోగించే వాహనాలకు సైతం అనుమతులు తప్పనిసరి అన్నారు. రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల లోపు ప్రచారాలు ముగించాలని, మైక్ సెట్‌లు వినియోగించేటప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌండ్ తగ్గించుకోవాలన్నారు. ఇంటింటా ప్రచారంపై ఎన్నికల నిబధదనలు పాటించాల్సిందేనన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె: లక్కనపల్లె సచివాలయ పరిధిలోని రామనపల్లెలో గురువారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ నవీకరణ, జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, సర్పంచులు క్రిష్ణారెడ్డి, బాలక్రిష్ణగౌడు, పార్టీ నేతలు రఘురామిరెడ్డి, రాజేంద్ర, మధుసూదన్, మణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

రొంపిచెర్ల: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కల్లూరు సీఐ శ్రీనివాసులు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు దద్దాలవారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె వీధులలో కేంద్ర బలగాలతో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రొంపిచెర్ల ఎస్‌ఐ సుకుమార్, ఏఎస్‌ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు మృతి


మృతి చెందిన రమణప్ప

బైరెడ్డిపల్లె: మండలంలోని ఎం.కొత్తూరుకు చెందిన రమణప్ప (55)తన పొలం వద్ద పంటలకు నీరు పారిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సర్పంచ్ చంద్రమౌళి, వీఆర్‌ఓ గోపాలక్రిష్ణ రమణప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం క్రిష్టప్ప


బైరెడ్డిపల్లెలో...

పెద్దపంజాణి: స్థానిక స్త్రీ శక్తి భవనంలో వెలుగు ఏపీఎం క్రిష్టప్ప ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఓటు వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మహిళలు తమ ఓటు విలువను గుర్తించాలని, ఏ ప్రలోభాలకు గురవకుండా ఓటును వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఓటు వేయడం తమ సామాజిక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. నిర్ణీత వయసు దాటిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు వసంత, చిన్నా, సుగుణ, హేమలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత

బైరెడ్డిపల్లె: ఓటు హక్కు కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం లలిత కోరారు. ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఓటు వేయడం తమ సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని, ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

రామకుప్పం మండలంలో..


రామకుప్పం: అవగాహన కల్పిస్తున్న సీఐ

రామకుప్పం: మండలంలోని వీర్నమల, ఆరిమానుపెంట గ్రామాల్లో గురువారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అనంతరం కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ శివకుమార్ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించి, శాంతియుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబే


పుంగనూరు రహమత్ నగర్‌లో...


రొంపిచెర్ల: మోటుమల్లెలలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకుల విమర్శ
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని వినతి

పుంగనూరు: రాయలసీమకు మనుగడ లేకుండ చేసింది చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి దుయ్యబట్టారు. సీమ అభివృద్ధి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేశారని, దీనిని దృష్టిలో ఉంచుకుని సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా వెంకట మిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.వెగురువారం పట్టణంలోని హైస్కూల్‌వీధి, బ్రాహ్మణవీధి, నాగపాళ్యెం ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి ర్యాలీ, ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. అలాగే రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, మైనారిటీ నాయకులు మహబూబ్‌బాషా కలసి రహమత్ నగర్‌లో ప్రచారాలు చేశారు. కృష్ణమూర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలమనేరు సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాయలసీమకు హంద్రీ–నీవా కాలువ, గండికోట రిజర్వాయర్, కుప్పానికి హంద్రీనీవా నీటిని విడుదల చేయడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే చేశారన్నారు. చంద్రబాబు కువిమర్శలకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు పూలత్యాగరాజు, జేపీ యాదవ్, కాళిదాసు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, బోయకొండ డైరెక్టర్ రాజేష్, నాయకులు మురుగప్ప, రామకృష్ణ, రమణ, ప్రభు, రషీద, అజీజ్, ఇర్ఫాన్, జావీద్ పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

పుంగనూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెంకట మిథున్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని మంగళంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఇంటింటా కరపత్రసి ప్రచారం చేశారు. అలాగే చదళ్లలో పార్టీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి, కుమ్మరనత్తం పంచాయతీలో సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పార్టీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రవి, విజయకుమార్, లోకేష్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ మండలంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. చిచ్చిలివారిపల్లెలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, మోటుమల్లెలలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, రొంపిచెర్లలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, జాండ్లవారిపల్లెలో సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాధరెడ్డి ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. అలాగే గానుగచింత, మోటుమల్లెల, జాండ్లవారిపల్లె, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, బోడిపాటివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ జెడ్పీటీసీ నీలుఫర్, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీటీసీలు రమణమ్మ, సిరాజున్నీసా, సర్పంచులు నాగిరెడ్డి, ప్రసాద్‌నాయుడు, జీవలత, నాయకులు చెంచురెడ్డి, కరంతుల్లాబేగ్, రవీంద్రనాధరెడ్డి, సురేంద్రనాయుడు, బాబు, ప్రశాంత్ రెడ్డి, అలీంఖాన్, సూర్య నారాయణ రెడ్డి, శ్రీనాధనాయుడు పాల్గొన్నారు.


పుంగనూరు: మంగళంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి


రొంపిచెర్ల: జాండ్లవారిపల్లెలో ప్రచారం చేస్తున్న హరినాధరెడ్డి


పుంగనూరు: హైస్కూల్ వీధిలో ప్రచారం చేస్తున్న నాయకులు


రొంపిచెర్ల: గానుగచింతలో..


రొంపిచెర్ల: ప్రచారం చేస్తున్న ఇబ్రహీంఖాన్

'బార్' కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


చంద్రప్ప


ఉదయ్‌కుమార్

కుప్పం: కుప్పం బార్ అసోసియేషన్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోర్టు ప్రాగణంలో న్యాయవాదులు సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా కేసీ చంద్రప్ప, కార్యదర్శిగా కొత్తపల్లి ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా అమర్‌నాథ్, కోశాధికారిగా మురుగన్, సహయ కోశాధికారిగా సుధాకర్, మహిళా కోశాధికారిగా శైలశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా అనిల్‌కుమార్, లైబ్రేరియన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు.

'బార్' అధ్యక్షుడిగా చెన్నకేశవులు



పుంగనూరు: పుంగనూరు న్యాయవాదుల అసోయేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఆకుల చెన్నకేశవులు 57 ఓట్లు సాధించి గెలుపొందారని, అలాగే ఉపాధ్యక్షుడిగా అరవింద్‌కుమార్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు మల్లికార్జునరెడ్డి, వెంకటరెడ్డి ప్రకటించారు. కార్యదర్శిగా రఘునారెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీగా సీవీ రమేష్, ట్రెజరర్‌గా ప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

ఐరన్ మాత్రల పంపిణీ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ నార్త్ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఆరోగ్య వైద్యశాఖ సిబ్బంది గురువారం ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి జయశంకర్ మాట్లాడుతూ, పిల్లలు ప్రతి గురువారం భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలను మింగాలని, వీటి వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. సిబ్బంది అముద, రమాదేవి, శాంతి పాల్గొన్నారు.